


# బంగారు పిచ్చుక

- ప్రతాప వెంకటసుబ్బారాయుడు,
సికింద్రాబాదు

రామనాథపురంలో నివశించే కృష్ణశర్మ నిరుపేద. భార్య, ఏడేళ్ళ పిల్లాడితో గుట్టుగా సంసారసాగరాన్ని ఈదుతున్నాడు. చాలా రోజుల్నుంచి పూజలకిగాని, శుభకార్యాలు నిర్వహించడానికిగాని పిలుపురాకపోవడంతో ఇంట్లో పొయ్యిలోంచి పిల్లి లేవడంలేదు. ఆకలితో అలమటించి పోతున్నారు. ఇదిలా ఉండగా ఒక బంగారు పిచ్చుక తుర్రున బయట నుంచి వచ్చి వాళ్ళముందు వాలింది. కృష్ణశర్మ కొడుకు లోపలికివెళ్ళి బియ్యం డబ్బాలో అక్కడక్కడా వున్న కొన్ని బియ్యంగింజలు తెచ్చి దాని ముందు వేశాడు. అది ముక్కుతో గబగబా పొడుచుకు తినేసింది. తర్వాత నెమ్మదిగా నడుచుకుంటూ కృష్ణశర్మ దగ్గరకు వచ్చి "కృష్ణశర్మా, నేను మాట్లాడే బంగారు పిచ్చుకని, సృష్టిలో నేనొక్కదాన్నే ప్రత్యేకం. నువ్వు ఇలా వచ్చి నా ఈకలు నాలుగు తీసుకుని అమ్ముకో... అవి మేలిమి బంగారపువి అయినందువల్ల నీకు బోలెడంత ధనం వస్తుంది.

ఇంద్రియాలను ప్రభావితం చేసే విషక్రిములను జ్ఞానమనే వెలుగు ద్వారా మాత్రమే తొలగించవచ్చు.

నీవు పాపాన్ని అధిగమించే యజమానివి కావాలి తప్ప దానికి బానిసవు కాకూడదు.

నీ దరిద్రమూ తీరుతుంది. నాలుగు ఈకలు లేకపోతే నేను ఎగరడానికి కష్టపడేమాట నిజమే కాని, నా ఆకలి తీర్చిన మీకు ఏదైనా ప్రత్యుపకారం చెయ్యాలని ఇలా చేస్తున్నాను" అంది.

దానికి కృష్ణశర్మ.. "చూడమ్మా! నవ్వు మా ఇంటికి వచ్చిన అతిధివి. మా దగ్గరలో ఉన్నంతలో మేము నీకు పెట్టాం. దానికోసం నువ్వు మాకేమీ ప్రత్యుపకారం చెయనక్కరలేదు. ఉపకారానికి ప్రత్యుపకారం ఆశిస్తే అది వ్యాపారం అవుతుంది. అందు చేత నువ్వు వెంటనే ఇక్కడి నుండి ఎగిరిపో. పైగా నీ ఈకలు అమ్మితే వచ్చే ధనం మాకు సోమరి తనం అలవాటు చేస్తుంది. మనిషన్న వాడు కష్టపడి కడుపునింపుకోవాలి. అంతేకాని తేరగా వచ్చే వాటిపై ఆశ పడకూడదు. దయచేసి వెళ్ళిపో" అన్నాడు.

"భేష్.. కృష్ణశర్మ.. భేష్..! నీ సరళమైన జీవితం, రుజువర్తన, నిజాయితీల గురించి విన్నాను. ఇప్పుడు చూస్తున్నాను. నా పరీక్షలో నువ్వు విజయం సాధించావు. పక్క ఊరిలోని జమిందారుగారు శ్రీరామ చంద్రాలయం కట్టించారు. అందులో పూజారిగా నియమించడానికి నిష్ఠాగరిష్ఠుడైన వ్యక్తికోసం ఎదురుచూస్తున్నాడు. నువ్వు రేపే వెళ్ళి అయన్ని కలువు. అంతా శుభం జరుగుతుంది'' అని తుర్రున ఎగిరిపోయింది.

మరుసటి రోజు కృష్ణశర్మ జమిందారుని కలసి, గుడిలో పూజారిగా నియమింపబడ్డాడు. కష్టాల్లో వున్నా విలువలు కోల్పోకూడదు. అప్పుడే భగవంతుడు చూసుకుంటాడు.